5

# మనుషుల్ని తినేవాళ్ళు

ఆది స్వర్గం.

అది నరకం.

అది అమృతాల అధరామృతాల జీవనది.

అది కాలకూట విషాల ఊటబావి.

అక్కడ అప్సరసలు అర్ధనగ్నలాస్యాలు చేస్తారు.

అక్కడ మనిషి రక్తపు రుచిమరిగిన రాక్షసులు విలయతాండవం చేస్తారు.

అక్కడ మనుషులుంటారు. మనుషుల్ని తినేవాళ్ళుంటారు.

ఆ స్వర్గం పేరు, ఆ నరకంపేరు - "నవభారత్ విలాస్!"

ఆ పట్టణంలో పేరుమోసిన "బోర్డింగ్ మరియూ లాడ్జింగ్!"

విందులకీ, వినోదాలకీ విఖ్యాతిపొందిన ఆ "నవ భారత్ విలాస్"లో - ఆ వేళ రాత్రి తొమ్మిదిగంటలవేళ- ఎనిమిదో నంబరు సింగిల్‌రూమ్‌లో - అలవాటుప్రకారం

హడావిడిగా లోపలికడుగెట్టిన బాయ్ రంగడు-చటుక్కున అడుగు వెనక్కి వేసి, నాలిక్కరుచుకుని, తెల్లబోయి నుంచున్నాడు!

ఆ సింగిల్ రూమ్‌లో వున్న సింగిల్ బెడ్ మీద పడుకున్న వాళ్ళిద్దరూ వొళ్ళు మరిచిపోయారు వొళ్ళుబలిసిన మగాడికి కళ్ళుకనబడ్డంలేదు. కళ్ళు మూసుకున్న ఆడదాని వంటిమీద సగం మేరకి గుడ్డల్లేవు

తెల్లబోయి నుంచున్న రంగడు తేరుకోకముందే అవతారం లేచి, "ఒరేయ్ వష్ చావా!...ఇంకో సీసా...మన బ్రాండ్ నీకు తెలుసుగా...?" అన్నాడు. అవతారం ఆ మగాడి పేరు.

"సారీ సార్!" - అన్నాడు రంగడు

"ఏమిరా, కొంపదీసి సీసాల్లేవా ఏం?"

"అదిగాదు సార్! పొరపాటున ... చూడకుండా లోపలికొచ్చేశాను..."

అవతారం వికటాట్టహాసం చేశాడు. చేసి - "ఓష్! యింతేగదా...ఏం పర్వాలేదు...ఎంతమంది చూసినా మనకేం భయంలేదు ..మన సంగతి నీకు తెలుసుగా ... అయినా యింకా ఏంలేదులే.. యింకో బుడ్డి తగిలిస్తేగాని లాభంలేదు...నువ్వు అర నిమిషంలో రావాలి... .. పరిగెత్తు..."

రంగడు పరుగెత్తేలోగా-కళ్ళుమూసుకు పడుకున్న ఆడది - కళ్ళు సగం విప్పి, సగంలేచి, సగం నవ్వి—"బావ

గారికి మరీ ఆత్రమెక్కువ తలుపైనా బిగించకుండా..."
మిగతా సగం మాటలూ మింగేసింది.

దానిపేరు మాణిక్యం.

రంగడు రూమ్‌లోంచి బయటికొచ్చాడు.

అవతారం పూర్తి పేరు శేషావతారం. చూడ్డానికి వరహావతారంలా వుంటాడు ఇదివరకు చాలా అవతారా లెత్తి చాలా చాలా ఘనకార్యాలు చేశాడు. లేటెస్టు అవతారం - "సహకార సంఘాధ్యక్షుడు". అవతారానికి సహకార పద్ధతిమీద మంచి విశ్వాసముంది. అందుకే మరి కొందరు పెద్దల సహకారంతో - రైతులకు పంచాల్సిన ఎరువులు, ఋణాలూ చాలా జాగ్రత్తగా స్వాహా చేసి ప్రజా సేవ చేస్తున్నాడు ఈ రకంగా నానాగడ్డీ తిని, గడ్డినిపెంచే ఎరువులు కూడా తినేసి, తిన్నదంతా అరిగించుకోవటం కోసం, ఉడపా దడపా షట్లు మొచ్చి, "నవభారత్ విలాస్"- భోజన మరియూ విశ్రాంతిగృహంలో విశ్రాంతి తీసు కుంటాడు-అవతారం.

అవతారం అర్జంటుగా తెమ్మన్న బుడ్డికోసం త్వర త్వరగా నడుస్తున్న రంగణ్ని, పన్నెండో నంబరు గదిలోంచి పిలిచారు రంగడు ఆ గదిలోకి వెళ్ళాడు.

గదిలో ముగ్గురున్నారు. వాళ్ళచుట్టూ సిగరెట్ పీక లున్నాయి; వాళ్ళ చేతుల్లో పేకముక్క లున్నాయి; అందు బాటులో బుడ్లూ గ్లాసులూ వున్నాయి; ముగ్గురిముందూ రూపాయల కట్టలున్నాయి; గదినిండా-సిగరెట్ పొగవుంది;

"ఏం కావాలి సార్?" - అనడిగాడు రంగడు.

"పిల్ల కావాలి" ఆ ముగ్గురిలోనూ నల్లగా ఎలుగ్గొడ్డులా వున్నవాడి సమాధానం.

"ఎవరు కావాలి సార్?"

"ఎవరెవరున్నారేంటి?" - ఈ ప్రశ్న ఎలుగ్గొడ్డుది కాదు, అడివి పందిది. ఎలుగ్గొడ్డుకి కుడివేపుని అడివిపంది కూచుంది.

రంగడు సమాధానం చెప్పేలోపునే, ఎనుబోతులా వున్న మూడోవాడు-"మాణిక్యం దొరకుద్దా?" అని అడిగాడు.

"లేదు సార్! మాణిక్యం, సావిత్రీ ఇయ్యాలా, రేపూ రెండు రోజులకీ బుక్కయిపోయారు సార్!"

"ఇంకెవరున్నార్రా మరి..?" ఎలుగ్గొడ్డు అడిగింది

"ఏమోసార్...సూత్తాను..."

"ఇంకా సూత్తావే ... లగెత్తు మరి ... ఆట ఎత్తేస్తున్నాం...అయిదు నిమిషాల్లో పిల్లని తేవాల..మంచిపిల్లని తెచ్చావంటే నీకో రూపాయ్..ఇంకా సూత్తావే లగెత్తు మరి"!-అంది అడివిపంది.

ఎలుగ్గొడ్డు..అడివిపంది..ఎనుబోతు - ఈ ముగ్గురిదీ ఉమ్మడి వ్యాపారం! అది ఫలానా వ్యాపారమని చెప్పడం కష్టం. వాళ్ళ అసలు పేర్లు చెప్పడంకూడా కష్టమే. వాళ్ళకి విడివిడిగా చాలా పేర్లున్నాయ్; ఉమ్మడిగా చాలా వ్యాపారాలున్నాయ్ —అసలు వాళ్ళేం చేసినా ... ఉమ్మడిగానే

చేస్తారు. వ్యాపారం చేసినా, పీకెలు కోసినా, పేకాడినా, తాగినా, తందనాలాడినా - ఇంకేంచేసినా ఉమ్మడిగానే. ఆ సంగతి రంగడికి తెలుసు అందుకే పిల్లకావాలన్నప్పుడు ఎందరని అడగలేదు.

మేడదిగి కిందికొచ్చాడు రంగడు. కౌంటర్ దగ్గర హోటల్ ప్రొప్రయిటర్ గుర్నాధం - మంత్రిగారి మేనమామ కొడుక్కి - కాకాపడుతున్నాడు. డైనింగ్ హాల్ కిట కిట లాడుతోంది. రకరకాల పదార్థాలు.. మాంసాలు... వాటివాసనలు ..సర్వర్ల హడావిడి ..రంగడికి ఆకలి గుర్తొచ్చింది ..అన్నం తినేదెప్పటికో. ..పై గదుల్లో పనిచేయటానికి యివ్వాళ రంగడొక్కడే వున్నాడు. .అతనితో పాటు పని చేసేవా డివ్వాళ రాలేదు.

డైనింగ్ హాల్ దాటి, కిచెన్ దాటి, ఆ వెనకవున్న గదిలో కెళ్ళాడు రంగడు, అక్కడ రకరకాల బుడ్లున్నాయి. వాటిలో అవతారాని క్కావసింది తీసుకుని, అక్కడున్న వాడికి రాసుకోమని చెప్పి బయటికొచ్చాడు. ఆ గదికి యింకా వెనక, బాగా మూలగా, చీకటికొట్టులాంటి గదొకటుంది, అందులో కెళ్ళాడు.

ఆ గదిలోవున్న బల్బు కిరసనాయిలు దీపంకంటే హీనంగా వెలుగుతోంది. గదిలో రెండు మూడు పాత కుర్చీలున్నాయి.

ఒక బల్లకూడా వుంది. బల్లమీద వరహాలు కూర్చుని వుంది. వరహాలుకూడా వొకళ్ళాడు మంచి పవరున్న క రెంటు

దీపంలాగే వెలిగింది. ఇప్పుడా వెలుగులేదు త్వరలో ఆరి పోవటానికి సిద్ధంగా వున్న కిరసనాయిల్ దీపంలా వుంది.

అద్దెకి తెచ్చి కట్టుకున్న చీరెకూడా మాసిపోయింది. పౌడర్ ఎంత మందంగా పులిమినా మొహాన ముడతలు దాగటంలేదు. కాటుక వ్రాసినకొద్దీ, కళ్ళలో కాపురమున్న చీకటి పెరిగిందేగాని తగ్గలేదు జడలో తురుముకున్న పువ్వు లివాల్టివి కావు వంటికి వ్రాసుకున్న అత్తరు కుళ్ళు కంపు కొడుతోందేగాని సువాసన వెయ్యటంలేదు.

రంగణ్ని చూడగానే వరహాలుకి ప్రాణం లేచి వచ్చింది. "ఏం తమ్ముడూ! బేరమేమైనా వుందా!"—అనడి గింది ఆశగా, ఆత్రంగా.

రంగడు సమాధానం చెప్పలేదు. వాడు వరహాలు కోసం రాలేదు. ఇంకెవరైనా వున్నారేమో చూద్దామని వచ్చాడు. ఆ హోటల్లో వాళ్ళమ్ముకునే వాళ్ళంతా బేరం దొరికేవరకు ఆ గదిలో నిరీక్షిస్తూ వుంటారు. ఇప్పుడు వర హాలుతప్ప మరెవరూ లేరక్కడ. వరహాలుకి బొత్తిగా "డిమాండ్"లేదు. ఆ సంగతి రంగడికి తెలుసు వరహాలుని తీసుకెళ్తే దీన్నెందుకు తెచ్చావని చీవాట్లేస్తారు

తనకిముట్టే డబ్బులుకూడా ముట్టవు కష్టమర్లు కోరిన సరుకందజేస్తేనే తన కేమైనా ముడుతుంది. అందుకే- "అచ్చే బేరంకాదు. ఏమీలేదు; వూరికే వచ్చాను-" అని సమాధానం చెప్పాడు వరహాలుకి.

11

వరహాలు కుంగిపోయింది. రంగడికేసి దీనంగా, దిగులుగా చూసింది "తమ్ముడూ! బేరం దొరికి ఇయ్యాల్టికి వారం రోజులైంది. షావుకారు అప్పులివ్వటం మానేశాడు. నిన్నటినుంచీ అన్నంకూడా లేదు...నాకు లేకపోయినా నేను చావను...కాని...ఇంట్లో నా బిడ్డలు..." ఆ పైన మాటలు పెగల్లేదు వరహాలుకి.

రంగడు మనిషి. రాయికాడు. అందుకే వరహాలు స్థితిచూసి కరిగాడు. "సరే చూస్తాను. ఎవరైనా కావాలంటే చెప్తాను..."-అన్నాడు.

వరహాలు గుక్క తిప్పుకొని - "బాబ్బాబు!... ఇవ్వాళ ఏదో వొకరకంగా ఒక బేరం చూసిపెట్టావంటే, చచ్చి నీ కడుపున పుడతాను"—అంది.

అక్కణ్ణించి రంగడు మేడమీదికొచ్చి, సరాసరి ఎనిమిదోనంబరు గదిలో కెళ్ళాడు. అక్కడ పెద్దయుద్ధం జరుగుతోంది. అవతారానికీ మాణిక్యానికీ డబ్బు విషయంలో పేచీ వచ్చింది. అవతారం గదంతా దున్నేస్తూ దాన్ని బూతులు తిడుతున్నాడు.

మాణిక్యం మంచం పట్టెమీద నిర్లక్ష్యంగా కూచుని మాటకి మాట సమాధానం చెప్తోంది, రంగడు రాగానే, బుడ్డి ఆలస్యంగా తెచ్చినందుకు వాణ్ణికూడా బూతులు తిట్టాడు అవతారం. రంగడు క్షమాపణ చెప్పుకుని, అక్కణ్ణించి వచ్చేశాడు. పన్నెండో నెంబరు గదిలోకెళ్ళాడు. అక్కడ జాయింట్ బిజినెస్‌గాళ్లు ముగ్గురూ పేకాట

మానేసి, తాగుతూ కూర్చున్నారు. రంగణ్ని చూడగానే - 'పిల్ల దొరికిందా?' - అని ఏక కంఠంతో అడిగారు.

"లేదుసార్, వరహాలొక్కతే వుంది. ఇంకెవరూ లేరు." - అన్నాడు రంగడు.

"వరాలా...థూత్ ! అదెంగును పనికొస్తుందిరా ఎండునక్క లాగుంటది. మనిషంతా కలిపినా కిలో మాంస ముండదు.. అన్నీ ఎముకలే ... అదెందుకురా" — అన్నాడొకడు.

"అది తప్ప యింకెవరూ దొరకరంటవా..?" అనడిగాడు రెండోవాడు.

"దొరకరు సార్-" అన్నాడు రంగడు.

"ఏదో వొకతి,మాకిప్పుడు అర్జంటుగా పిల్ల కావాల- అదెట్టావున్నా సరే, వుండేదేదో దాన్నే పట్రా, ఈ బుడ్డి ఖాళీ అయ్యేసరికీ అదే రంభలా గుంటది దాన్నే పట్రా. బేగెళ్ళు" - అన్నాడు మూడోవాడు.

మిగతా వాళ్ళిద్దరూ సరే కానిమ్మన్నారు.

"మేం ముగ్గురమున్నాం. కావాలంటే రెండు రూపాయలెక్కువ తీసుకోమను.

"అంతేగాని తరవాత పేచీపెడ్తే కుదరదు ముందే జెప్తున్నాం." అని హెచ్చరించాడొకడు.

రంగడు మేడదిగి మళ్ళీ వరహాలున్న గదిలోకొచ్చాడు. "ఏం తమ్ముడూ, బేరం దొరికిందా?" అంటూ ఈసారి మరింత ఆశగా. ఆత్రంగా అడిగింది వరహాలు.

"దొరికిందిగానీ..." అని, నసిగాడు రంగడు.

"ఏంటి తమ్ముడూ, చెప్పు...ఎంతిచ్చినా ఫరవా లేదు...ఎంతైనా సరే..."

"అదికాదు...డబ్బు బాగానే యిస్తారు...ఆళ్ళు ముగ్గురున్నారు—పైగా దున్నపోతుల్లా గున్నారు...నువ్వేమో యిలాగున్నావు...అందుకని ఎనకాడతన్నాను..." అన్నాడు రంగడు.

"ఫరవా లేదు తమ్ముడూ ... ముగ్గురుగాదు—పది మందైనా సరే...నేను సావను, నేను సచ్చినా ఫరవా లేదు.. నా బిడ్డలు... పద తమ్ముడూ, పైకెల్దాం పద.." అంది వరహాలు,

రంగడింకేమీ మాట్లాడలేక పోయాడు. వరహాలుని పైకి తీసుకెళ్ళి పన్నెండో నంబరు గదిలోకి పంపాడు. గది తలుపు మూసుకుంది.

ఎనిమిదోనంబరుగది ముందుకొచ్చాడు. అవతారానికి మాణిక్యానికి రాజీ కుదిరిందికాబోలు మళ్ళీ తలుపు బిగించుకున్నారు.

గుమస్తా వుద్యోగాలకి అభ్యర్థుల్ని ఎన్నిక చేయడం కోసం పైవూరినుంచి వచ్చిన అధికారి ఏడో నెంబరు గదిలో దిగాడు. ఇవ్వాళ తొమ్మిది గంటలకి మాంచి-పడుచుదాన్ని-ఖరీదైనదాన్ని-నజరానాగా సమర్పించుకుంటానన్న అభ్యర్థి

గాడు పైదైనా యింకా పత్తా లేడు. అంచేత ఆఫీసరుగారు ఆగ్రహంతో వున్నారు

కొత్తరకం అనుభవం కొనుక్కుందామని వచ్చిన కాలేజీకుర్రాడు ఆరోనంబరు గదిలో ఖంగారు పడుతున్నాడు,

అయిదో నంబరు గదిలో-కంట్రాక్టరు, కంట్రాక్టు ఇప్పించే ఇంజనీరూ నాటాలు నిర్ణయించుకుంటున్నారు

పదవ నెంబరు గదిలో-పంచాయితీ స్థాయి నాయకులు నలుగురు ఆవతలి పార్టీ లీడర్ని అతిరహస్యంగా ఖూనీ చేయించడానికి పథకాలు పన్నుతున్నారు.

వీళ్ళందరికీ యింకా మరికొందరికీ కావలసినవన్నీ సమకూర్చి-రంగడు కిందికెళ్ళేసరికి పదకొండు దాటింది. కౌంటరుదగ్గర ఎవరూ లేరు, డైనింగ్ హాల్ ఖాళీగా వుంది. ఒకచోట యిద్దరు సర్వర్లు బీడీలు తాగుతూ కూర్చొని బూతుకథలు చెప్పుకుంటున్నారు, రంగడు బేసిన్‌లో చేతులూ మొహమూ కడుక్కుని. కిచెన్‌లో కెళ్ళి కూర్చున్నాడు. ఆకలి మండిపోతోంది. నౌకర్లుకూడా రంగడు తప్ప అంతా అప్పటికే తినేశారు కునికిపాట్లు పడుతున్న ఒక సర్వరు గొణుక్కుంటూ - అడుగూ బొడుగూ మిగిలినవన్నీ రంగడికి వడ్డించి, బయటకు పోయాడు

తింటూండగా, రంగడికి వరహాలు గుర్తొచ్చింది, నిన్నటినుంచీ అన్నం తినలేదని చెప్పిన సంగతి గుర్తొచ్చింది. వరహాలు మీద వికరీతమైన జాలేసింది, "ఆ తాగుబోతు

ముండాకొడుకులు ఎవ్వడొదుల్తారో ఏమో పాపం! ఈ పూటైనా దానికి కూడుండదు”- అనుకున్నాడు. తను తినే దానిలోనే, కాస్త అన్నమూ రెండు కూరలూ మిగిల్చాడు. తన భోజనం ముగించి, మిగిలినవి ఒక విస్తరిలో కట్టి, అంతకుముందు వరహాలు కూర్చున్న గదిలో కెళ్ళాడు. గదిలో ఎవరూ లేరు. అన్నవు పొట్లం బల్లమీదపెట్టి బయటికొచ్చాడు

హోటల్ ముందున్న కిళ్ళీకొట్టుదగ్గర - కాన్‌స్టబు లొకడు కారా కిళ్ళీ నముల్తూ. శృంగార కథల సచిత్రమాస పత్రికొకటి తిరగేస్తున్నాడు పత్రిక పూరికే యివ్వాలి సొచ్చినందుకు కొట్టువాడు లోలోపల తిట్టుకుంటున్నాడు. రంగ డక్కడికి వెళ్ళి కిళ్ళీ కట్టించుకున్నాడు. బీడీలు కొను క్కుని ఒకటి వెలిగించాడు.

రోడ్డుమీద జనం పల్చబడిపోయారు. ఆకాశంలో చుక్కలు కిక్కిరిసి వున్నాయి. మునిసిపాలిటీ సైరన్ పన్నెండు కావడానికింకా అయిదు నిమిషాలుండనగానే కూసింది.

“అబ్బా అప్పుడే పన్నెండైందే” అనుకుని రంగడు లోపలికొచ్చేశాడు. వరహాలొచ్చిందేమో చూద్దామనుకుని ఆ గదిలో కెళ్ళాడు. బల్లమీద పెట్టిన అన్నవుపొట్లంఅలాగే వుంది. వరహాలొచ్చిన సూచనలేవీలేవు కాస్సేపలాగే కూర్చొని, అక్కడే బల్లమీద పడుకున్నాడు.

o o o

తెల్లవారింది. "నవభారత్ విలాస్"లో రాత్రంతా పేరుకుపోయిన పాపాల చీకటిని, సూర్యుడు తన వెలుగు కిరణాల చీపుళ్లతో క్లీన్ చేస్తున్నాడు.

క్లీనర్ కుర్రాడొచ్చి లేపితేగాని రంగడికి మెలకువ రాలేదు. లేచి, కళ్లు నులుముకుని చుట్టూ చూశాడు చీకటి కొట్టులాంటి ఆ గదిలోకి కూడా కాస్త వెలుగొచ్చింది వరహాలు కోసమని బల్లమీంద పెట్టిన అన్నపు పొట్లం. ఎలుకలు కాబోలు చించి చెల్లాచెదురు చేశాయి. చీమలు పుట్టలు పోశాయి.

వరహాలు రాలేదు.

"ఇంకెక్కడి వరాలు..." అన్నాడు క్లీనర్ కుర్రాడు.

—o—